
# ఋణం తీరింది



★

* రచన : "ప్రవీణ్ సుశ్రీ" *

ఆఫీసు గోడ గడియారం 'టంగ్' 'టంగ్' మని ఐదు కొట్టడంతో ఎక్కడ సీట్లు అక్కడే ఖాళీ అయ్యాయ్! అది నెలాఖరు రోజులు అవడంచేత అందరి జేబుల్లో క్రొత్త నోట్లు బయటకు నిక్కి నిక్కి చూస్తున్నాయ్! ఎప్పుడు ఈ బంధాన్నుండి విముక్తి అవుదామా అన్నట్లుగానే!

అందరి ముఖాన ఆనంద లక్ష్మి తాండవిస్తోంది. ఆనాడు గుమాస్తా లందరికీ ఓ పర్వదినంగానే వుంటుంది మరి. కానీ శేఖర్ మాత్రం కుర్చీలోనే కూర్చుని, ఆ తిరుగుతూన్న ఫాన్ కేసి పిచ్చిగా చూస్తున్నాడు. మాసినగడ్డం, ఫాన్ గాలికి అటూ, ఇటూ రేగి కొట్టుకుంటూన్న అతని జుట్టు, భుజాలదగ్గర చినగి, పీచులు రేగిన పాత కోటు, దానిక్రింద అసలు తెల్ల రంగు పోయి, ఏదో కృత్రిమ రంగు సృష్టించుకున్న షర్టు, చినిగిన అతని బూడిద రంగు పాంటు, కాళ్ళను గోడకు బల్లిలా కరచిపట్టుకుని తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూన్న ముతక చెప్పులు...ఇదీ అప్పటి అతని వాలకం. చూసిన ప్రతివారూ అతను ఏక్లాసుకు చెందిన వ్యక్తో! అందరూ అట్టే పసిగట్టెయ్య గలరు. ఆ ఫాన్ తిరుగుతూ వున్నంతవడిగానే అతని బుఱలో ఆలోచన్లూ గిఱ్ఱున తిరుగుతూన్నయ్! చిరునవ్వులు చిందిస్తూ కళగా కనిపించవలసిన అతని మోమెందుకో ఆనాడు చంద్రుడు లేని కాళరాత్రిలా కళా విహీనంగా వుంది.

"శేఖర్ బాబూ! శేఖర్ బాబూ!!" అని ఒక పిలుపు. తిరుగుతూన్న ఫాన్ ఒక్క సారిగా ఆగి పోయింది. దానితోపాటు వలయంగా ఆవరకంగా తిరుగుతూన్న అతని వెర్రి మొర్రి ఆలోచన్లు చటుక్కున ఆగిపోయాయ్! తన ఆలోచన్లకు అంతటి అంతరాయం కల్గించినాతనెవరా? అన్నట్లుగ శేఖర్ వెనక్కి తిరిగి చూశాడు. తెల్లని మాసిన గడ్డం, చివర్లో సుడులు తిరిగిన మీసాలు, లోతుగా ఎక్కడో వుంది. ఈలోకాన్ని అతిదీనంగా చూస్తున్న అతని కండ్లు, చిరిగిన కోటు, ఓపాత పంచె, ఈరకంగా వున్న వ్యక్తి ఆఫీసు ప్యూను కోటయ్య. ఫాన్ ఆపి నమస్కరించాడు శేఖరానికి. శేఖర్ దానికి ప్రతిగా తల ఆడించాడు పరధ్యానంగానే. మరలా ఒక్కసారి చూసుకున్నాడు తనను. కోటయ్యకు తనకువున్న వ్యత్యాస మేమిటి? అతను చదువుకోలేదు గాబట్టి ప్యూనుగా అయ్యాడు. మరి తను చదువుకున్నాడు గాబట్టి హెడ్ క్లర్క్‌గా వెలగబెట్టున్నాడు. అంతే! అనుకున్నాడు శేఖర్ తన జీవిత చక్రాన్ని ఒక్కసారిగా తనలో దొర్లించుకుంటూ! తనలో నవ్వుకుంటూ!

ఎదురుగా వున్న వ్యక్తిని గమనించే స్థితిలో శేఖర్ పొరపాటున ఎప్పుడుగూడా వుండడని బాగా ఎరిగి వున్నాడు కాబట్టి, కోటయ్య ఎదురుగా వచ్చాడు. మళ్ళా 'శేఖర్ బాబుగారూ' అంటూ ఇప్పటికిగాని శేఖర్ తన మనస్సును, తన దృష్టిని ఏకు చేసేసి ఎదురుగా స్థంభంలా నిలుచున్న కోటయ్య వేపు మరల్చక తప్పింది కాదు. శేఖర్ కోటయ్యను గుర్తించాడు.

"ఓహో! నీవా కోటయ్యా! ఏం కావాలి?"

"అయ్యో! నాకేం కావాలండి! బాబుగారూ!

టయమైందండి! మేనేజరుగారూ! గురుమూర్తిగారూ! అందరూ ఇళ్ళకు ఎప్పుడో వెళ్ళిపోయారండి!"

"ఆ! అంటూ శేఖర్ గోడ గడియారం వేపు జూసాడు. లేచి, నిజమే! అన్నట్లుగా 'టంగ్' యంటూ పలికింది గోడ గడియారం. కోటయ్య వేపు చూశాడు ఓవిధంగా. అతని చూపుల్లో దాగివున్న బాధ, క్షోభను గ్రహించాడు కోటయ్య. బాబూ, కష్టాలన్న తర్వాత వచ్చేవి మనుషులకుగాని మానులకు వస్తాయా బాబూ? అందరికీ వస్తాయి బాబూ, కాని కొంతమందికి ఎక్కువ, కొంతమందికి తక్కువ, అంతే. వాటిని చిరునవ్వుతో ఎదుర్కోటమే మనకు చాత కావలసింది. అవన్నీ మనస్సులో వుంచుకుని కుమిలి, కుమిలి, ఏడ్వడం, మనస్సును పాడుచేసుకోవడం 'ద్చ్' మీ పద్ధతి నాకేం నచ్చలేదు బాబుగారూ" అన్నాడు కిటికీ రెక్క వేస్తూ!

"అవును కోటయ్యా, అందరిలా జీతాలు నాకూ వచ్చాయనే సంతోషం నాకెందు కుండగూడదు? 'ద్చ్' ఎలా వుంటుంది? అయినా నీకు తెలీందేముంటుంది చెప్పు, మా యీదీన స్థితి జూసి జాలిపడేది నీ వొక్కడివే, మాగురించి తెలుసుకోవాలని ఎవరికుంటుంది? అయినా ఎవరికైనా ఎందు కుండాలి?" అని శేఖర్ ఏమిటో పిచ్చి పిచ్చిగా వాగేస్తున్నాడు.

కోటయ్య కిటికీ రెక్కలు వేయడం పూర్తి అయ్యింది. శేఖర్ మరలా మామూలు ధోరణిలోకి వచ్చాడు. శేఖర్ కుడిచెయి కోటు జేబులోకి వెళ్ళింది. రెండు పదుల నోట్లను పైకి తీసాడు. మరలా గుప్పెట్లో ముడుచుకున్నాడు.

"కోటయ్యా!" అని పిలిచాడు, వుక్కపోయడం మూలంగా, నూతినుండి పెద్ద జల పూరుతున్నట్లుగా ఏక ధారగా ముఖంపై కారుతూన్న స్వేదాన్ని ఎడమ చేత్తో తుడుచుకుంటూ గుప్పిటగా ముడిచిన చేతిని మరలా కోటు జేబుల్లోనికి పోనిచ్చి బయటకు వచ్చి నిలుచున్నాడు.

"శేఖర్ బాబూ, పిలిచారా" అన్నాడు కోటయ్య తలుపు వేసి దగ్గరకు వచ్చాడు.

"అవును" కోటయ్యా, నిన్ను చూస్తుంటే నాకు ఒక విధమైన సిగ్గు, దయాదాక్షిణ్యం, ఓర్పు, ఉదారత్వం — ఈ మంచి గుణాలను చూస్తుంటే గర్వం, నీముందు నీరసంగా, నిరాశగా, పేలవంగా చూడ్డానికి రోతనిపిస్తూన్న నా జీవితాన్ని చూస్తుంటే నాకు ఓవిధమైన అసహ్యాం, భయం. అంతే కాదు, ఒక్కో రోజు ఆత్మహత్య చేసుకోవాలనే వాంఛగూడా కల్గుతూంది. శేఖర్ మాటల్లో స్థాయి పెరిగింది. కంఠం కాస్త గాద్గధికంగా అవ్వడంచేత కాస్త జిరగూడా సాగింది. కళ్ళు కాలిమిలో అగ్ని కణాల్లా రక్తం చారలు చారలుగా వుండడంవల్ల ఎరుపెక్కాయి. వాటిలో కాఠిన్యం కన్పిస్తూంది. ముఖంమీద చమటతో తడిసి అట్టగా ఫాలభాగంమీద అతుక్కుపోయిన వెంట్రు

TEX TOM
Trade Mark
BANIANS
మీ...
కుటుంబానికి కావలసినవాటిని ఎన్నుకోండి!!
- టెక్స్‌టామ్ -
* బనియన్లు. * డ్రాయర్లు.
* చెడ్డీలు. * కట్‌బాడీలు.
తయారించువారు :—
టామ్‌టెక్స్ నిట్టర్స్, తిరుపూరు—638602

కలసు ఎడమ చేత్తో సవరించుకుంటూ చెప్పుకపోతున్నాడు. అతనిలో కొన్ని వేల అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయిప్పుడు.

"బాబూ, ఆ పాపిష్టి పనిమాత్రం చేయకండి బాబూ" కోటయ్య ఆత్రంగా అన్నాడు.

"కోటయ్యా, నీకు తెలియదు. ఈ పాడు బ్రతుకు బ్రతికే బదులు ఆ పాపిష్టి పని చేస్తేనే నయం"

"బాబూ, మనకు ఆ భగవంతుడు కాలాలు రోజులు ప్రసాదించింది చావడానికి కాదు బాబూ, జీవించడానికి. ఆయువును పొడిగించడానికి. మీరు లేనిపోని వెర్రి ఆలోచన్లు పెట్టుకొని మీ బుఱ్ఱను పాడుచేసుకోకండి, ఈ వాళ ఇలా కష్టంగా బ్రతుకుతారు, రేపు ఇంతకంటే సుఖంగా బ్రతుకుతారు. రోజులు రావాలి, ప్రతిదానికలా బెంగ పెట్టుకుంటే ఎలా బాబూ, పాపం, భగవంతుడు మరీ మిమ్మల్ని" కోటయ్య ఆర్ద్రోక్తిలోనే ఆపేశాడు. అతని స్వరం మారిపోయింది, గొంతును ఎవరో నొక్కి పట్టినట్లుగా వుంది. గొంతులోంచి అందుకే మాట పెగిలి రాలేదు.

"కోటయ్యా, భగవంతుడు నన్నెందుకో మరీ చిన్నచూపు చూస్తున్నాడు నీవుగాని నిజంగా లేకుంటె, నాగతేంకాను. నిజంగా నీవు మా పాలిట దైవంలా మాకొచ్చి కష్టాలను ఆదుకుంటున్నావు" శేఖర్ గొంతు బొంగురుపోయినట్లుగా వుంది.

"అంత మాట అనకండి బాబయ్యా"

"అవును కోటయ్యా" నాకు తోటి గుమాస్తాలను అడగటమంటే చచ్చేంత సిగ్గు. అయినా నాకందరు అప్పు ఇవ్వడంగూడా మానుకున్నారు. ఆనాడు చేసేది లేక పరువు ప్రతిష్టలను ఓవంక బెట్టి గురుమూర్తిని నోరు తెరచి అడిగితే, ఇవ్వకపోగా పైగా... "ఏమండీ, మీ ఒక్క సంపాదన మీకు చాలదని తోచినప్పుడు మీ శ్రీమతినిగూడా ఏ ఆఫీసులోనో...ఆ ఎందుకు ఈ ఆఫీసులోనే గుమాస్తాగా ఇరికించెయ్యొచ్చును గదా" అన్నాడు. చిన్న చెంప దెబ్బ కొట్టినట్లుగా అయ్యింది నాకపుడు. తోటి గుమాస్తాలుగూడా పెద్ద చిన్న కొంచం భయ భీతులనేవి లేకండా ఏదో, గుసగుసలు చెప్పుకొని నవ్వారపుడు. నాకపుడు ఆవేశం వచ్చింది. కొట్టేద్దామన్నంత కోపం వచ్చింది కాని, ప్రయోజనం? శూన్యం. శేఖర్ పళ్ళు పటపటమని కొరుక్కున్నాడు. పిడికిలి బిగించాడు, ముఖంలో కోపం అనేది, కళ్ళలో కాఠిన్యం అనేది, కనిపిస్తూనే వున్నాయి.

"బాబూ, అవన్నీ ఇపుడెందుకు" "బాబూ? కోటయ్యా, ఆనాడే నేను నిజంగా పౌరుషాన్ని కోల్పోయాను. ఆరోజు నీవు నా బాధను గ్రహించి చాటుగా నన్ను పిలిచి ఆ ముప్పై నాచేతిలో పెట్టకుంటే, నా బాబు నాకు దక్కేవాడేనా? అంతే కాదు. మొన్న పండక్కి మా చెల్లెలు, దాని పెనిమిటి రాగా వాళ్ళ బాగోగులూ నీవే గనుక చూడకపోతే, నా గతేంకాను, నా పరువు నిలిచేదేనా? చెప్పు కోటయ్యా, ఇప్పటికే నీ కెంతో నేను ఋణపడి వున్నాను. నీ ఋణం నా జన్మలో తీర్చుకోగలనా కోటయ్యా తీర్చుగోగలనా?" శేఖర్ ఏమిటో ఆలోచనలతో ఒక గంట గడిపాడు.

(సశేషం)

